RNI No - APTEL/2022/81596

# జనోదయ

కరీంనగర్ శనివారం 03.01.2026 సంపుటి : 03 సంచిక : 33 పేజీలు : 08 వెల: రూ.5

Karimnagar Saturday 03.01.2026 Volume: 03 Issue 33 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

## త్వరలో 'ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్ట్'



8

# బీఆర్ఎస్‌ది మూసీని మించిన విషం

## ○రియల్ ఎస్టేట్ బ్రోకర్‌నంటూ నాపై ప్రచారం



- ఫార్మా కంపెనీల వ్యర్థాలతో మూసీ కాలుష్యం..
- మహిళలు గర్భం దాల్చలేని దుస్థితి ఏర్పడింది
- మూసీ ప్రక్షాళన చేయాలో, వద్దో చెప్పాలి..
- డీపీఆర్ సిద్ధమయ్యాక శాసనసభలో పెడతాం
- మూసీని నైట్ ఎకానమీగా మారుస్తాం..
- గండిపేటకు 20 టీఎంసీల గోదావరి జలాలు
- 365 రోజులూ మూసీలో మంచినీళ్లు
- కోట్ల రూపాయలు పెట్టి సోషల్ మీడియాలో నాపై దుష్ప్రచారం . . ..మూసీ పునరుజ్జీవంపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

3

### మూసీ కంటే రేవంత్ మాటల కంపే ఎక్కువ



- ముందు ఆయన నోటిని ప్రక్షాళన చేయాలి
- సభను స్పీకర్ ఏకపక్షంగా నిర్వహిస్తున్నారు
- జవాబు చెప్పలేక ఎదురుదాడి:హరీశ్

# కేసీఆర్..సభకు రావాలి


- ఆరోపణలపై మాట్లాడి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి
- లేకుంటే బీఆర్ఎస్‌ను దేవుడు కూడా కాపాడలేడు
- పాలమూరులో ప్యాకేజీ అమ్ముకున్న హరీశ్‌రావు
- ఆయన వల్లే ఆ ప్రాజెక్టు ఇబ్బందుల్లో పడింది
- కేటీఆర్, హరీశ్ పిల్లకాకులు.. నాన్న నీడలో పెరిగారు
- కేసీఆర్ పిలిచినా ఇక బీఆర్ఎస్‌లోకి వెళ్లను
- 5న మండలిలో రాజీనామా కారణాలు చెప్తా : కవిత



8

## పండగ తర్వాత
# పుర పోరు

- ఈ నెల చివరివారంలో షెడ్యూల్ విడుదల
- ఫిబ్రవరి రెండో వారంలో పోలింగ్




**హైదరాబాద్, జనవరి 2 :** సంక్రాంతి పండగ తర్వాత రాష్ట్రంలో పుర పోరుకు తెర లేవనుంది. పంచాయతీ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన ఉత్సాహంతో మున్సిపల్ ఎన్నికలకూ కాంగ్రెస్ ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ నెల చివరి వారంలో ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుందని, ఫిబ్రవరి రెండో వారంలో ఎన్నికలు జరగనున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. జీహెచ్ఎంసీ మినహా అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఎన్నికలను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారమూ కలిసొచ్చే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి ఫిబ్రవరి 3 నుంచి ఉమ్మడి జిల్లాల వారీగా పర్యటనలు పెట్టుకున్నారు. ఒక్కో ఉమ్మడి జిల్లాలో ఒక్కో అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొని సమీప గ్రామంలో ఏర్పాటు చేసిన సభల ద్వారా ప్రజలకు సందేశాన్ని ఇవ్వనున్నట్లు చెబుతున్నారు.

## నేడు కొండగట్టుకు
# పవన్ కళ్యాణ్



**జగిత్యాల:** తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన కొండగట్టుకు ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన ఖరారయ్యింది. శనివారం ఉదయం స్వామివారిని దర్శించుకొని తిరుమల తిరుపతి దేవస్థానం సమకూర్చే రూ. 35.13 కోట్ల నిధులతో నిర్మించనున్న దీక్ష విరమణ మండపం, 96 గదుల సత్రం నిర్మాణాలశంకుస్థాపన చేయనున్నారు. ఒకేసారి 2 వే ల మంది భక్తులు దీక్షలు విరమించేలా మండపం నిర్మించ నున్నారు.టి.టి.డి. బోర్డు శనివారం నిర్వహించే కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు , ఏపీ శాసన మండలి విప్ పిడుగు హరిప్రసాద్ , చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, టీటీడీ బోర్డు మెంబర్లు బి.ఆనందసాయి తదితరులు పాల్గొననున్నారు. పవన్ కల్యాణ్ రాక సందర్భంగా జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు.

## భవనాల
# క్రమబద్ధీకరణ ప్రకటిస్తాం



- న్యాయపరమైన చిక్కులన్నీ త్వరలో పరిష్కరిస్తాం: శ్రీధర్‌బాబు
- రాష్ట్రంలో మరో రెండు ప్రైవేటు యూనివర్సిటీలకు అనుమతి
- రంగారెడ్డి, భువనగిరి జిల్లాల్లో ఏర్పాటు

**హైదరాబాద్, జనవరి 2 :** భవన క్రమబద్ధీకరణ పథకం(బీఆర్ఎస్) ప్రకటిస్తామని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. జీహెచ్ఎంసీ చట్టం సవరణలపై జరిగిన చర్చలో ఈ అంశాన్ని ఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ లేవనెత్తారు. నగరంలో వేలమంది తమ భవనాల క్రమబద్ధీకరణ కోసం వేచిచూస్తున్నారన్నారు. దీనిపై మంత్రి సమాధానమిస్తూ, విద్యుత్తు, నీటి సౌకర్యం పొందుతూ భవన నిర్మాణాల అనుమతి తీసుకోని కుటుంబాలు హైదరాబాద్‌లో పెద్దఎత్తున ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్ ప్రకటించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయుతే కొన్ని న్యాయపరమైన సమస్యలు ఉన్నందున వాటిని పరిష్కరిస్తున్నామని వివరించారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలన్నీ పూర్తి చేసి బీఆర్ఎస్ ప్రకటిస్తామన్నారు. రాష్ట్రంలో మరో రెండు ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వం అనుమతించింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం మామిడిపల్లిలో విమానాశ్రయానికి సమీపంలో అమిటీ విశ్వవిద్యాలయం, భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం దేశ్ ముఖీ గ్రామంలో సెయింట్ మేరీస్ రీహాబిలిటేషన్ యునివర్సిటీలు ఉన్నాయి.

# కాంగ్రెస్ సర్కార్ రౌడీల సామ్రాజ్యాన్ని నిర్మిస్తోంది

### హత్యాయత్నంపై స్పందించిన గాలి జనార్ధన్ రెడ్డి

**బళ్లారి:** తనపై జరిగిన హత్యాయత్నంపై గాలి జనార్ధన్ రెడ్డి స్పందించారు. బళ్లారి లోని హవంబావీ సమీపాన బ్యానర్ విషయంలో ఘర్షణ జరిగిందని తెలుసుకుని వచ్చానని తెలిపారు. ఆ సమయంలో తనపై కాల్పులు జరిపేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే భరత్ రెడ్డి ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని చెప్పారు. ఇప్పుడు వాల్మీకి విగ్రహం ద్వారా ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రయత్నించారని ఆరోపించారు. భరత్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి పెద్ద నేరస్తుడు అని అన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం రౌడీల సామ్రాజ్యాన్ని నిర్మిస్తోందని మండిపడ్డారు.



## గాలి జనార్ధన్ రెడ్డిపై హత్యాయత్నం

### బళ్లారిలో తీవ్ర ఉద్రిక్తత



కర్నాటక మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధన్ రెడ్డిపై హత్యాయత్నం జరిగింది. గురువారం రాత్రి బళ్లారి లోని హవంబావీ ప్రాంతంలో ఆయన ఇంటి వద్దే కాల్పులు జరిగాయి. బళ్లారి నగర ఎమ్మెల్యే భరత్ రెడ్డి సన్నిహితుడు సతీశ్ రెడ్డినే ఈ కాల్పులకు పాల్పడ్డారు. అయితే ఈ కాల్పుల నుంచి గాలి జనార్ధన్ రెడ్డి తప్పించుకు న్నారు.మహర్షి వాల్మీకి విగ్రహ ఏర్పాటు సందర్భంగా ఫ్లెక్సీపై చెలరేగిన వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసిం ది. ఈ క్రమంలోనే గన్‌మెన్ తుపాకి లాక్కున్న సతీశ్ రెడ్డి రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. ప్రతిఘటించిన జనార్ధన్ రెడ్డి అనుచరులు కూడా ఎదురుకాల్పులు జరపడంతో కాంగ్రెస్ కార్యకర్త రాజశేఖర్ మృతిచెందగా.. సతీశ్ రెడ్డికి బుల్లెట్ గాయమైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో బళ్లారిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

## కలుషిత నీటి ఘటన

### 10 మంది మృతి : ఇండోర్ మేయర్



**ఇండోర్:** దేశంలోనే స్వచ్ఛనగరంగా పేర్కొనే బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కలుషిత తాగునీటి వ్యవహారం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. భగీరథ్‌పురలో జరిగిన ఈ ఘటనలో ఇప్పటి వరకూ 10 మంది మరణించినట్లు ఇండోర్ మేయర్ పుష్యమిత్ర భార్గవ శుక్రవారం తెలిపారు. కలుషిత నీరు తాగి డయేరియాతో ఈ మరణాలు సంభవించినట్లు పేర్కొన్నారు.భగీరథ్‌పుర నుంచి సేకరించిన తాగునీటిని ల్యాబ్‌కు పంపి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో కలుషిత నీరు తాగడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ల్యాబ్ నివేదిక నిర్ధారించినట్లు వెల్లడించారు. పైప్‌లైన్ లీకేజీ కారణంగా ఆ ప్రాంతంలోని తాగునీరు కలుషితమైనట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఇక ఈ ఘటనలో సుమారు 100 మందికిపైగా స్థానికులు అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## రామగుండంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



**జనోదయ, గోదావరిఖని, డిసెంబర్ 02:**

రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో నగరంలో సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ శుక్రవారం ప్రారంభమైంది. మొదటి రోజు 2,3,25,26,27 డివిజన్‌లలో ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అక్బర్ నగర్, ముబారక్ నగర్, శాలపల్లి, కృష్ణా నగర్, న్యూ పోరట్ పల్లి, మల్కాపూర్ రోడ్డు, శ్రీనగర్ కాలనీ రాజీవ్ రహదారి తదితర ప్రాంతాల్లో సామూహికంగా ఊడ్చే కార్యక్రమంతో పాటు రోడ్ల ప్రక్కన పెరిగిన పిచ్చి చెట్లు, తుప్పలను జె సి బి, బ్లేడ్ ట్రాక్టర్లతో తొలగించారు. ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి ట్రాక్టర్‌లతో తరలించారు. మురుగు నీటి కాలువల్లో పూడిక తొలగించి, బ్లీచింగ్ చేశారు. రామగుండం రైల్వే ఓవర్ బ్రిడ్జ్, అండర్ బ్రిడ్జ్ రోడ్లపై పేరుకుపోయిన దుమ్ము ను ఊడ్చి శుభ్రం చేశారు. అడిషనల్ కలెక్టర్ ( స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ కార్య క్రమాన్ని పర్యవేక్షించగా డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి క్షేత్ర స్థాయిలో పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. నగర పాలక సంస్థ సానిటరీ ఇన్స్పెక్టర్లు నాగ భూషణం, సంపత్, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎకో వారియర్స్ ప్రతినిధి మహేందర్, మెప్మా సిఓలు ఊర్మిళ, శ్వేత, జవాన్లు సోమేష్, ముదాం తిరుపతి, ఉమా మహేశ్వర్, బండారి రవి, అశోక్, సుగుణాకర్, యూసఫ్, సారయ్య, సంపత్, దయానంద్, ఆర్పిలు పాల్గొన్నారు.

# నెలాఖరు కల్లా మున్సిపాలిటీల నోటిఫికేషన్






### మున్సిపల్ ఎన్నికలపై మంత్రి అడ్లూరి క్లారిటీ

**హైదరాబాద్, జనవరి2 :**


మున్సిపల్ ఎన్నికలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు.ఈ నెలాఖరు కల్లా మున్సిపాలిటీల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు.ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో చిట్ చాట్ చేశారు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్. గత రెండు సంవత్సరాలుగా బీఆర్ ఎస్ నేతల వ్యవహార శైలి చూస్తున్నామని.. వారి పంతం నెగ్గించుకోవడానికి ఏమైనా చేస్తారని విమర్శించారు. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడే ముఖం బీఆర్ఎస్ నేతలకు లేదని ఎద్దేవా చేశారు. తమ తప్పు ఉంటే అసెంబ్లీలో నిరూపించాలని సవాల్ విసిరారు. మూసీ అంశంలో బీఆర్ఎస్ నేతలే రన్నింగ్ కామెంటరీ చేశారని ప్రసావించారు. బీఆర్ఎస్ ప్రభావం కోల్పోయిందని.. ఉనికి కాపాడుకోవడానికి ఆ పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.నరేగా పథకంపై, బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడలేక బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. పేదవారి పథకం గురించి బీఆర్ఎస్ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ల విద్యార్థులకు వేడి నీటిని అందించడానికి సోలార్ పవర్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టామని అన్నారు. ఇందుకోసం అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. కేసీఆర్ హయాంలో ఎమ్మెల్యేలకు అసెంబ్లీలో కనీసం గౌరవం ఇవ్వలేదని ఆగ్రహంవ్యక్తం చేశారు.



# మూసీ కాలుష్యం కంటే కొందరి కడుపులోని విషం ప్రమాదకరం

### విపక్ష సభ్యులకు సీఎం హితవు

**హైదరాబాద్, జనవరి 02:** కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని విపక్ష పార్టీలోని పలువురు కీలక నేతలకు సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు. శుక్రవారం అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరమన్నారు. తాను వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారంటూ విపక్ష సభ్యులను ఆయన సూటిగా నిలదీశారు. ప్రజలకు నిజాలు తెలియవద్దని చర్చ జరగకుండా చూడాలనుకుంటున్నారా? అని వారిని ప్రశ్నించారు. వివరాలు చెబుతుంటే నొప్పి ఎందుకు మీకు అంటూ విపక్ష సభ్యులపై ఆయన మండిపడ్డారు.మొన్న వర్షాలు వచ్చినప్పుడు ఎక్కడికిపోయారంటూ వారిని సీఎం రేవంత్ రెడ్డి కడిగేశారు. కొంతమంది తనను రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటున్నారని.. రియల్ ఎస్టేట్ సైతం ఒక ఇండస్ట్రీనే అని ఆయన వివరించారు. హైటెక్ సిటీ నిర్మించాలనుకున్నప్పుడు కూడా ఇలాంటి విమర్శలే చేశారని పేర్కొన్నారు. రోజు రోజుకు పట్టణీకరణ పెరుగుతుందని చెప్పారు. రాబోయే 20 ఏండ్లలో 75 శాతానికి పట్టణీకరణ పెరుగుతుందని తెలిపారు. తెలంగాణలో మూసీ నది 240 కిలోమీటర్లు ప్రవహిస్తుందన్నారు. అనంతగిరి హిల్స్ నుంచి వాడపల్లి వరకు మూసీ ప్రవాహం ఉందన్నారు. మూసీ, ఈసీ నదులు కలిసే చోటు బాపుఘాట్ నిర్మిస్తామని.. అందుకే అక్కడ గాంధీసరోవర్ ప్రాజెక్ట్ చేపట్టామని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతంలోనే అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. జలవనరులను కలుషితం చేసి కబ్జాలు పెట్టి ఫాంహౌస్‌లు నిర్మించారని.. వాటి డ్రైనేజీలను జంట జలాశయాలకు కలిపారని మండిపడ్డారు. అందుకే ఆ డ్రైనేజీలను కూలగొట్టి.. కబ్జాలపై చర్యలు తీసుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.అయితే మూసీ నది ప్రక్షాళనను మొదట 21 కిలోమీటర్లు చేయాలని చూస్తున్నామని.. హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు అభివృద్ధి చేస్తామని చెప్పారు. మార్చిలో తొలి దశ పనులు ప్రారంభిస్తామన్నారు. సంక్రాంతిలోగా తొలి దశ డీపీఆర్‌పై క్లారిటీ ఇస్తామని పేర్కొన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 51 కి.మీ మూసీ అభివృద్ధి చేస్తామని వివరించారు. 51 కి.మీ ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తామన్నారు. మీరాలం ట్యాంక్ కూడా మూసీ అభివృద్ధిలో భాగమేనని స్పష్టం చేశారు. ఈ ట్యాంక్‌పై రూ.450 కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. గతంలో గుజరాత్‌లో సబ ర్మతి నది అభివృద్ధి కోసం 60 వేల కుటుంబాలను మరో ప్రాంతానికి తరలించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. యూపీలో గంగా నది ప్రక్షాళన చేసి రివర్‌ఫ్రంట్ ఏర్పాటు చేశార న్నారు. నది పరివాహక ప్రాంతాల అభివృద్ధిని బీజేపీ ఎన్నికల అజెండాగా మర్చిందని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో నదుల ప్రక్షాళనను వ్యతి రేకించట్లేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నదులు కలుషితం చేసి నివాసయోగ్యం కాని ప్రాంతాలుగా చేశారని మండిపడ్డారు. నదీ పరివాహక ప్రాంతాల నిర్వాసితులకు ప్ర త్యామ్నాయం కోరామని చెప్పారు. మూసీ నది కలుషితం కారణంగా నల్లగొండ జిల్లాలో ప్రజలు జీవించలేని పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కలుషిత నీటి నుంచి కాపాడాలని వేలాదిగా విజ్ఞప్తులు వచ్చాయన్నారు. ఏడాదంతా మూసీలో నీళ్లు ప్రవహించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. మూసీ ప్రక్షాళన కన్సల్టెంట్ కోసం గ్లోబల్ టెండర్లు పిలిచామన్నారు. 3 సంస్థల జాయించ్ వెంచర్ కింద మూసీ పునరుద్ధరణ చేపడుతున్నట్లు వివరించారు. గోదావరి నుంచి 20 టీఎంసీలు నగరానికి తరలించేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు.నగరం దాహార్తి తీర్చేందుకు 15 టీఎంసీలు తరలించేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మరో 5 టీఎంసీలు గండిపేటకు తరలించాలని యోచన తమ ప్రభుత్వానికి ఉందని వివరించారు. మూసీ పరివాహాక ప్రాంతంలో ఆలయాలు, మసీదులు, గురుద్వారాలు, చర్చి నిర్మిస్తామని తెలిపారు. మూసీ నదిని ప్రక్షాళన చేయాల్సిందేనని స్పష్టం చేశారు. వచ్చే మూడు నెలల్లో అంచనాలు ఫైనల్ చేస్తామని ప్రకటించారు. ఏడీబీ బ్యాంకు రూ.4,100 కోట్ల రుణం ఇస్తుందన్నారు. త్వరలో అన్ని వివరాలు వెల్లడిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచన చేశారు. మీ నియోజకవర్గాల్లో ఎలాంటి అభివృద్ధి కావాలో చెప్పాలని సూచించారు. పేదలకు మంచి ఇళ్లు కట్టించి వారికి మెరుగైన వసతులు కల్పిద్దామని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనేదే తమ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు.



# రేవంత్ ముఖ్యమంత్రా ? స్ట్రీట్ రౌడీనా ?

### అసెంబ్లీని బూతులమయం చేశారు
### ప్రతిపక్షానికి మైక్ ఇవ్వరా
### మూసీకంటే సీఎం మాటల కంపు ఎక్కువ
### అసెంబ్లీ సమావేశాలను బాయికాట్ చేస్తున్నాం
### మాజీ మంత్రి హరీష్ రావు ప్రకటన

**హైదరాబాద్, జనవరి 2:** అసెంబ్లీ శీతాకాల సమావేశాలను బాయికాట్ చేయాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఈ మేరకు మాజీ మంత్రి హరీష్ రావు మీడియాకు తెలియజేశారు. గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ శీతాకాల సమావేశాలను బహిష్కరించాలని బీఆర్ఎస్ నిర్ణయం తీసుకుందన్నారు. స్పీకర్, ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ సమావేశాలను బాయ్ కాట్ చేస్తున్నామని మాజీ మంత్రి స్పష్టం చేశారు. అసెంబ్లీ తీరు చూస్తుంటే శాసనసభ నిబంధనలకు విరుద్ధంగా ఉందని మండిపడ్డారు.బీఏసీ మీటింగ్‌కు ప్రభుత్వం తరపున గంటన్నర లేటుగా వచ్చారని.. అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీని బూతులమయం చేశారని మండిపడ్డారు. అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష పార్టీకి మైక్ ఇవ్వరా అని ప్రశ్నించారు. పార్లమెంటులో మోదీని రాహుల్ గాంధీ తిట్టడంలేదా అని నిలదీశారు. అసెంబ్లీలో తాను సీఎం గురించి మాట్లాడితే తప్పు ఏంటి అంటూ ఫైర్ అయ్యారు. అసెంబ్లీని గాంధీ భవన్‌లాగా, సీఎల్పీ మీటింగ్‌లాగా మార్చారంటూ వ్యాఖ్యలు చేశారు. మూసీ కంపు కంటే సీఎం నోటి నుంచి వచ్చే మాటల కంపు ఎక్కువంటూ విరుచుకుపడ్డారు. రేవం త్ రెడ్డి ముఖ్యమంత్రా లేక స్ట్రీట్ రౌడీనా అని అన్నారు.రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహి, నీళ్ల ద్రోహి అని.. కేసీఆర్‌ను ఇష్టం వచ్చినట్లు సీఎం మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఆర్ ఆర్ ట్యాక్స్ నడుస్తోందని ఆరోపించారు. ప్రతి దానికి కమీషన్లు తీసుకుంటున్నారన్నారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కుతున్నారని మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలు చేశారు.



## మూసీ పేరుతో ఇండ్లను కూల్చివేస్తే ఊరుకోం


### బుల్డోజర్ల కింద పడుకుని అడ్డుకుంటాం : అసెంబ్లీలో హరీష్‌రావు

మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనకు డబ్బులు ఎక్కడి నుంచి తెస్తున్నారని అడిగారు. ఒకసారి లక్ష కోట్లు అన్నారని.. మరోసారి లక్షన్నర కోట్లు అన్నారని తెలిపారు. మూసీ సుందరీకరణకు ఒరిజినల్ వ్యయమెంత అని నిలదీశారు.రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ప్రశ్నోత్తరాల సమయంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. మూసీ సుందరీకరణ కోసం ఇప్పటివరకు ఎన్ని ఇండ్లు కూల్చివేశారని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులందరికీ ఇండ్లు ఇచ్చారా అని అడిగారు. ప్రాజెక్టు కోసం ఎంత ప్రైవేటు భూమిని సేకరిస్తున్నారని ప్రశ్నించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రూ.14.50 లక్షల చొప్పున నిర్వాసితులకు పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని గుర్తుచేశారు. అలాగే 200 గజాల ఇంటి స్థలం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మరి నిర్వాసితులకు కేసీఆర్ కట్టిన డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చారా అని ప్రశ్నించారు.మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లు కూల్చివేస్తే బీఆర్ఎస్ ఊరుకోదని హెచ్చరించారు. అవసరమైతే బుల్డోజర్ల కింద పడుకుని కూల్చివేతలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

# విద్యతో వెలిగించిన సమానత్వ దీపం

**జనవరి 3 మహిళా ఉపాధ్యాయ దినోత్సవం, సావిత్రి బాయ్ పూలే 195వ జయంతి సందర్భంగా**

మనుషులందరిలో ప్రవహించేది ఒకే రక్తం అయినప్పటికీ,ఒకప్పుడు మానవ సమాజంలో కుల,మత,లింగ విభేదాలు తీవ్రంగా రాజ్యమేలాయి.నేటికీ కొన్ని రూపాల్లో అవే వివక్షలు కొనసాగుతూనే ఉన్నాయి.అటువంటి అంధకార కాలంలో సమాజాన్ని ప్రేమించి,మానవత్వమే నిజమైన ధర్మమని తన జీవితం ద్వారా నిరూపించిన మహానుభావులు కొందరున్నారు. వారిలో అగ్రగణ్యురాలు, మహోన్నత సంఘ సంస్కర్త,భారత మహిళా విద్యా ఉద్యమానికి ఆద్యురాలు సావిత్రీబాయి పూలే. 1831 జనవరి 3న మహారాష్ట్ర సతారా జిల్లాలోని నయాగావ్ గ్రామంలో ఒక రైతు కుటుంబంలో జన్మించిన సావిత్రీబాయి, చిన్ననాటి నుంచే సమాజంలోని అసమానతలను గమనిస్తూ ప్రశ్నించే మనస్తత్వాన్ని పెంచుకున్నారు. కులాధిపత్యం, స్త్రీలపై జరుగుతున్న వివక్ష,మూఢ సంప్రదాయాల పట్ల ఆమెకు తీవ్ర అసహనం ఉండేది.అందరికీ సమాన హక్కులు ఉండాలన్న ఆలోచన ఆమె జీవన తత్వంగా మారింది.సావిత్రీబాయి జననం భారత సామాజిక చరిత్రలో ఒక కీలక మలుపుగా చెప్పుకోవచ్చు.ఎందుకంటే ఆమె జీవితమంతా మహిళా విద్య, సామాజిక న్యాయం,మానవ హక్కుల కోసం అంకితం చేసి,మహిళా విద్యా విప్లవానికి పునాది వేసింది.ఈ కారణంగానే నేడు జనవరి 3ను మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారు.బాల్యవివాహాల కాలంలో తొమ్మిదేళ్ల వయసులో సావిత్రీబాయికి వివాహం జరిగింది.అయితే ఆమె జీవితాన్ని పూర్తిగా మలుపుతిప్పినది భర్త మహాత్మా జ్యోతిరావు పూలే ప్రోత్సాహం.ఆయన సహకారంతో అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలైన సావిత్రీబాయి,విద్యనే తన ఆయుధంగా ఎంచుకున్నారు.చదువు వ్యక్తిగత అభివృ ద్ధికే కాదు,సమాజ మార్పుకు శక్తివంతమైన సాధనం అని గ్రహించిన ఆమె,ఉపాధ్యాయ వృత్తిని జీవిత లక్ష్యంగా స్వీకరించారు.ఈ వివాహం ఆమె జీవితంలో ఒక సాధారణ సంఘటన కాదుబీమహిళా విద్యా విప్లవానికి దారితీసిన చారిత్రక మలుపుగా నిలిచింది.1848లో పుణేలో బాలికల కోసం భారతదేశంలోనే తొలి పాఠశాలను ప్రారంభించడం ద్వారా సావిత్రీబాయి చరిత్ర సృష్టించారు."బాలికలు చదవకూడదు" అన్న అంధవిశ్వాసాల మధ్య ఆమె అడుగులు విప్లవాత్మకమైనవిగా నిలిచాయి.చదువు చెబుతున్న సమయంలో ఆమెపై రాళ్లు విసిరారు,మట్టిని చల్లారు,అవమానించారు అయినా ఆమె వెనక్కి తగ్గలేదు చదువే విముక్తికి మార్గమన్న విశ్వాసంతో ముందుకు సాగారు. కేవలం నాలుగు సంవత్సరాల్లోనే గ్రామీణ ప్రాంతాల్లో ఇరవై పాఠశాలలను స్థాపించి ఉచిత విద్యనందించారు.జీవితకాలంలో భర్తతో కలిసి మొత్తం యాభై రెండు పాఠశాలలను నిర్వహించడం ఆనాటి సమాజంలో అసాధారణ సాహసానికి నిదర్శనం.ఈ మహిళా విద్యా విప్లవం ద్వారా ఆమె సమాజానికి ఇచ్చిన సందేశం స్పష్టమైనది విద్య లేకుండా స్వేచ్ఛ లేదు, విద్యతోనే సమానత్వం సాధ్యం. సావిత్రీబాయి కేవలం ఉపాధ్యాయురాలు మాత్రమే కాదు.ఆమె ఒక సంపూర్ణ సామాజిక సంస్కర్త.బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు.విధవ మహిళల పునర్వివాహానికి మద్దతు ఇచ్చారు. వితంతువుల శిరోముండన విధానాన్ని తీవ్రంగా నిరసించారు.1860లో క్షురకులతో సమ్మె చేయించి చరిత్ర సృష్టించారు. 1852లో మహిళా సేవామండలిని స్థాపించి మహిళల్లో హక్కులపై అవగాహన కల్పించారు.విధవలు, అనాథ బాలికల కోసం ఆశ్రయ గృహాలను ఏర్పాటు చేసి వారికి గౌరవమైన జీవితం అందించారు. "బాలహత్య ప్రతిబంధక్ గృహం" నిర్వహించిన తొలి భారతీయ మహిళగా ఆమె నిలిచారు.స్త్రీ విముక్తి లేకుండా సమాజ అభివ ృద్ధి అసాధ్యమన్నదే ఆమె సామాజిక సంస్కరణల మూల సందేశం. కవయిత్రిగా,ఉపన్యాసకురాలిగా ఆమె స్త్రీలలో ఆత్మ విశ్వాసం నింపారు.మౌనం కాదు,ప్రశ్నించడమే మార్పు అనే భావనను బలంగా ప్రచారం చేశారు.స్త్రీ చదివితే సమాజం చదువుతుందని,స్త్రీ బలంగా నిలబడితే దేశం ముందుకు నడుస్తుందని ఆమె నమ్మకం.ఈ ఆలోచనలే నేటికీ స్త్రీల సాధికారతకు దిశానిర్దేశం చేస్తున్నాయి. 1873లో జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ మహిళా విభాగానికి సావిత్రీబాయి నాయకత్వం వహించారు. పురోహితులు లేకుండా వివాహాలు నిర్వహించే విధానాన్ని ప్రవేశపెట్టి,కులపితృస్వామ్య వ్యవస్థకు సవాల్ విసిరారు.ఈ సమాజం ద్వారా స్త్రీలకు,శూద్రులకు, అణగారిన వర్గాలకు ఆత్మగౌరవం నేర్పారు. విద్యే విముక్తి మార్గమని నమ్మి,బాలికల విద్యను సమాజ ఉద్యమంగా మలిచారు. మతం పేరుతో జరిగే అణచివేతను ప్రశ్నించమని ప్రజలకు ధైర్యం ఇచ్చారు. సమానత్వం దానం కాదు,అది హక్కు అనే సత్యాన్ని గుర్తు చేసిన వేదిక సత్యశోధక్ సమాజ్ అయితే,ఆ వేదికపై వెలిగిన దీపశిఖ సావిత్రీబాయి పూలే.1897లో పుణేలో ప్లేగ్ వ్యాధి ప్రబలినప్పుడు, ప్రాణ భయాన్ని లెక్కచేయకుండా బాధితులకు సేవ చేశారు.కొడుకు యశ్వంత్‌తో కలిసి నిరంతరం సేవలందించారు.ఆమెకు మానవత్వం కులం,మతం,లింగం అనే గడపలలో బంధించబడలేదు.ప్రతి మనిషిలో ఒకే రక్తం ప్రవహిస్తుందని,ప్రతి జీవితం సమానంగా విలువైనదని ఆమె నమ్మకం. వ్యాధి భారిన పడి 1897 మార్చి 10న సావిత్రీబాయి పరమపదించారు.మానవ సేవే మహా ధర్మమని ఆమె తన జీవితంతో నిరూపించారు.సావిత్రీబాయి పూలే 195వ జయంతి కేవలం ఒక జ్ఞాపక దినం మాత్రమే కాదు.ఇది మహిళా విద్యకు 195 ఏళ్ల చారిత్రక వారసత్వానికి గుర్తింపు,సమానత్వం సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనం,నేటి తరం బాలికలకు ఆత్మవిశ్వాసానికి ప్రేరణ.ఆమె ఇచ్చిన సందేశం నేటికీ మార్గదర్శకం.బాలిక చదువుకుంటే కుటుంబం మారుతుంది, కుటుంబం మారితే సమాజం మారుతుంది,సమాజం మారితే దేశం అభివృద్ధి చెందుతుంది.సావిత్రీబాయి పూలే -విద్యా వెలుగును వెలిగించిన తొలి సమానత్వ దీపం.




**వేల్పుల మహేందర్**
**ఎంఎస్సీ,ఎంఎ ఎంఇడి**
**కింగ్‌స్టన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ అధ్యాపకుడు,**
**పొన్నాల,సిద్దిపేట**
**మొబైల్:9912775834**



## నిశ్శబ్ద విస్ఫోటనం

"పెదవి దాటని మౌనం ఆయుధమైతే,
నీ ఆలోచనే విజయానికి వారధి.
నిన్ను ప్రశ్నించే గొంతులకు బదులివ్వకు,
గమ్యం చేరాక నీ గర్జనే లోకాన్ని మారుస్తుంది!.

నిశ్శబ్దం అంటే స్తబ్ధత కాదు,
అది విస్ఫోటనానికి ముందుండే నిలకడ.
కాలం నీ మౌనానికి అర్థం వెతుక్కుంటుంది,
నీ గెలుపు పిడుగులా పడి సత్యాన్ని చాటుతుంది!.

మౌనమే విల్లైతే బాణం గురితప్పదు,
నీ శ్రమ గెలిచాక ఈ లోకం తలవంచుతుంది.
శబ్దానికి బానిసైన ఈ జగతి ఏమన్నా,
శిఖరాన్ని చేరేదాకా నీ నిశ్శబ్దాన్ని వీడకు!.

మాటలు కేవలం అలజడిని మిగిలిస్తాయి,
కానీ మౌనం సామ్రాజ్యాలను నిర్మిస్తుంది.
శూలంలా దూసుకుపోయే మాటలకన్నా,
లక్ష్యాన్ని ముద్దాడే నీ నిశ్శబ్ద ప్రయాణమే మిన్న!

**సాహిత్య రత్న**
**రాము కోలా, దెందుకూరు**
**ఖమ్మం,9849001201.**



## రచనలకు ఆహ్వానం

నిత్య నూతనంగా వెలువడుతూ ఆశేష పాఠకాదరణ పొందుతున్న 'జనోదయ' , వాస్తవం తెలుగు దినపత్రికకు సమ కాలీన రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్య,వైద్యం, స్పోర్ట్స్, వ్యవసాయం, శాస్త్రసాంకేతికం, సాహిత్యం, కథలు, నవలలు, వినోదం ..ఇలా అనేక అంశాల మీద వ్యాసాలు, రచనలకు ఆహ్వానం. మీ రచనలను కంపోజ్ చేసి కింది వాట్సాప్ నంబర్‌కు పంపాలి.

**ఎడిటర్**
**వాస్తవం, జనోదయ**
**తెలుగు దినపత్రిక**
**8074124190**

**నోట్ :** అంశం ఏదైనా విభిన్న శైలిలో, పాఠకులకు హత్తుకునేలా, విజ్ఞానాన్ని పంచేలా ఉండాలి. కంపోజ్ చేసిన వ్యాసాలకు మాత్రమే ప్రాధాన్యత ఉంటుంది. వ్యాసాల ప్రచురణ విషయంలో సంపాదకుడిదే తుది నిర్ణయం.ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు.

## ప్రకృతిసంహారం

# మానవాళి స్వీయ వధకు వేదిక

**భారతదేశమే** కాదు, ఇప్పుడు ప్రపంచమంతా ప్రకృతి యుద్ధభూమిగా మారింది. హిమాలయం నుండి ఆరావళి వరకు, వింధ్యం నుండి పశ్చిమ కనుమల వరకు, దండకారణ్యం నుండి ఈశాన్య అరణ్యాల వరకు మన సహజ వారసత్వం అంతా మొండిగా కొల్లగొడుతున్నారు. ప్రపంచ వన్యప్రాణి నిధి (డబ్ల్యూ.డబ్ల్యూ.ఎఫ్.) 2022 నివేదిక ప్రకారం, గత 50 సంవత్సరాలలో జంతుజాలంలో 68% తగ్గింది. ఇది జరిగింది ప్రధానంగా మానవుల ప్రవర్తన వల్లే. భారతదేశంలో మాత్రమే, 2001 నుండి 2020 వరకు 18,000 చదరపు కిలోమీటర్ల అటవీ భూమి తగ్గిపోయింది – ఇది పాకిస్థాన్ దేశపు విస్తీర్ణంతో సమానం.

**కార్పొరేట్ దోపిడీ - రాక్షసత్వం :**

విశ్వసనీయ అంతర్జాతీయ అధ్యయనాల ప్రకారం, ప్రపంచ( సీఓ2) ఉద్గారాల్లో 70 శాతం కంటే ఎక్కువ 100 కంపెనీల నుండి వస్తున్నాయి. భారతదేశంలో, అటవీ, ఖనిజ, నీటి సంపదపై సంప్రదాయ హక్కులు కలిగిన గిరిజనులు, స్థానిక సంఘాలు ప్రధాన బాధితులు. ఆధునికత పేరుతో సాగుతున్న త్రవ్వకాలు ప్రకృతి సమతుల్యతకు ఘోరమైన దెబ్బతీస్తున్నాయి. ఉదాహరణకు, ఛత్తీస్గఢ్ లోని 'బైలాడిలా' ఇనుప ఖనిజ గనుల వల్ల ఆ ప్రాంతంలో సుమారు 10,000 హెక్టార్ల అడవులు నాశనమయ్యాయి. నీటి నాణ్యత ఘోరంగా క్షీణించింది. ఈ కార్పొరేట్ సామ్రాజ్యాలు దేశీయ, విదేశీ మార్కెట్లకు మన ఖనిజ సంపదను దోచుకుపోతున్నాయి, వాటి వెనుక స్థానిక సంఘాల వలస, ఆరోగ్య సమస్యలు, జీవనోపాధి నష్టం వంటి దుర్భర విషాదాలు దాగి ఉన్నాయి.

**శాసన రంగంలో రక్షణ పొరలు పగిలిపోవటం:**

సుప్రీంకోర్టు ఆరావళి విషయంలో ఇచ్చిన నిర్వచనం (100 మీటర్ల ఎత్తు కొండ.. రెండు కొండలు 500 మీటర్లలో పర్వతశ్రేణి) వాస్తవానికి పర్యావరణ రక్షణలో ఒక భయంకరమైన చిన్న తలుపును తెరిచింది. ఈ నిర్వచనంతో, అనేక పవిత్రమైన, పర్యావరణ దృష్ట్యా కీలకమైన ప్రకృతి నిర్మాణాలు "రక్షణ వలయం" నుండి బయటపడతాయి. ఆరావళిలో ఇప్పటికే 31,000కి పైగా అక్రమ గనులు పనిచేస్తున్నాయని నివేదికలు చెబుతున్నాయి. హర్యానా, రాజస్థాన్, గుజరాత్, ఢిల్లీకి సహజ రక్షణ కవచమైన ఈ పర్వతశ్రేణి ధ్వంసమైతే, ఈ ప్రాంతం ఎండిపోయే వరదలు, గాలి కాలుష్యం, నీటి సంక్షోభం వంటి ఘోర విపత్తులకు గురవుతోంది.

**ప్రకృతి ప్రతీకారం: ఇప్పటికే ప్రారంభమైన నాశనం:**

ప్రక ృతి విధ్వంసం ఇప్పుడు కేవలం భవిష్యత్తు భయం కాదు. ప్రస్తుత వాస్తవం. 2018 కేరళ వరదలు, 2013 ఉత్తరాఖండ్ మహాప్రమాదం, 2021 చెన్నై వరదలు ఇవన్నీ అతి వర్షానికి దారితీసిన అక్రమ అటవీ నిర్మూలనకు నేరుగా సంబంధించినవే. గత ఐదు దశాబ్దాలలో ప్రపంచ వ్యాప్తంగా సంభవించిన 12,000 ప్రక ృతి విపత్తుల వల్ల 20 లక్షలకు పైగా ప్రాణాలు పోయాయి. ఇది మన చర్యలకు ప్రకృతి సమర్పించే బిల్లు మాత్రమే. భారతదేశం ప్రపంచంలోనే ప్రకృతి విపత్తులకు అత్యంత హాని గురి అయిన దేశాల్లో ఒకటిగా నిలిచింది. విశ్వ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ.హెచ్.ఓ.) గణాంకాల ప్రకారం, ప్రపంచంలో అత్యంత కాలుష్యం గల నగరాల్లో 14 భారతదేశంలోనే ఉన్నాయి. ఇది మన భూమి, నీటి, వాయు మాధ్యమాన్ని పాడుచేసే విధ్వంసక పనుల ఫలితమే.

**ప్రతిఘటనలు .. అణచివేతలు**

పర్యావరణ ఉద్యమకారులు, శాస్త్రవేత్తలు, గిరిజన సమాజాలు వందలాది పోరాటాలు చేస్తున్నారు. కానీ, సంపద మరియు అధికార శక్తుల ముందు వారి స్వరాలు అణగదొక్కబడుతున్నాయి. నక్సలైట్, రాజద్రోహి వంటి లేబుల్లు అతికించి, పర్యావరణ కార్యకర్తలను బలవంతంగా మౌనం వహించేలా చేస్తున్నారు. 2010 నుండి 2020 మధ్యకాలంలో భారతదేశంలో 200కి పైగా పర్యావరణ కార్యకర్తలు హత్యకు గురయ్యారు. వీరిలో చాలా మంది గిరిజనులు లేదా స్థానిక సంఘాలకు చెందినవారు. ఇది



ప్రశ్నించే శక్తులను అణిచివేయడానికి రాజ్యం మరియు కార్పొరేట్ ప్రయోజనాల మధ్య సంభవించే ఘోరమైన ఒకానొక కూడలిని సూచిస్తుంది.

**భవిష్యత్తు - అపాయ సంకేతాలు - పరిష్కార మార్గాలు:**

ఈ క్షణంలో కూడా, ఆరావళి పర్వతాలు తమ రక్షణ కోసం అల్లాడుతున్నాయి. ఈ ప్రకృతి రక్షకుడు పతనమైతే, ఉత్తర భారతదేశం అంతా ఎడారీకావడానికి ఎక్కువ కాలం పట్టదు.దీర్ఘకాలిక ప్రభావాలు మరింత భయంకరంగా ఉంటాయి:

1. **జలసంబంధ విపత్తులు:** నీటి వనరులు ఎండిపోతాయి, వరదలు మరింత వినాశకారిగా మారతాయి.
2. **వ్యవసాయ విపత్తు:** మట్టి సారం తగ్గటం, వర్షపాతం అస్థిరత వల్ల వ్యవసాయ ఉత్పత్తులు క్షీణిస్తాయి.
3. **ఆరోగ్య విపత్తు:** కాలుష్యం వల్ల శ్వాస, హ ృదయ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి.
4. **జీవవైవిధ్య నష్టం:** అనేక స్థానిక జాతులు అంతరించిపోతాయి, ఆహార గొలుసు ముక్కలు ముక్కలవుతుంది.

చివరిగా ...మనిషే మార్పు తీసుకురావాలి "ప్రక ృతిని మనం కాపాడితే, ప్రకృతి మనలను కాపాడుతుంది" ఈ సూత్రం ఇప్పుడు జీవిత మరణాల ప్రశ్నగా మారింది. ప్రతి పర్వతం పడిపోవడం, ప్రతి నది కలుషితమవడం, ప్రతి అడవి అద ృశ్యమవడం, ఇవన్నీ మన శ్వాస, మన ఆహారం, మన భవిష్యత్తుపై దాడులు. సుప్రీంకోర్టు స్టే ఒక తాత్కాలిక విజయం కావచ్చు. కానీ, నిజమైన యుద్ధం మన మనస్సుల్లో, మన విధానాల్లో, మన జీవన విధానంలో జరగాలి.

**మన తరువాతి తరాలు మనను ప్రశ్నిస్తాయి:**

"మీరు ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నారు? మీరు ఎందుకు పోరాడలేదు?" మన జవాబు ఏమిటో చెప్పే అవకాశం మనకు లేకుండా, మనం ఇప్పుడే చర్య తీసుకోవాలి. ప్రకృతి సంహారం మానవాళి స్వీయ వధకు సమానం . ఈ హెచ్చరిక మనం గ్రహించేలోపే నిమిషానికి మనకు భూమి, నీరు, గాలి, ఆహారం మిగిలి ఉంటాయో లేదో ఆ నిమిషం మీద ఆధారపడి ఉంటుంది.

**డాక్టర్ కోలాహలం**
**రామ్ కిశోర్**
**9849328496**



# పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి

**కలెక్టర్ కుమార్ దీపక్**

**జనోదయ,బెల్లంపల్లి, జనవరి 2:**
ప్రభుత్వ విద్యాసంస్థల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ స్పష్టం చేశారు. శుక్రవారం బెల్లంపల్లి నియోజకవర్గంలోని వేమనపల్లి మండలంలో గల నీల్వాయి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో చేపడుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం తాగునీరు, విద్యుత్ సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. స్థానికంగా ఉన్న గిరిజన సంక్షేమ అవసరమా పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేకమైన దృష్టి సాధించాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఆదేశించారు. విద్యార్థుల సంఖ్య పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. పాఠశాలలో సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుమారస్వామితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనంపై విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ కుమార్ దీపక్

# భక్తులు లేక.. బుగ్గ దేవస్థానం వెల వెల

**వెంటాడుతున్న పెద్దపులి భయం**

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 2:**
గత కొన్ని రోజులుగా బెల్లంపల్లి మండలం లోని కన్నాల, బుగ్గ అటవీ ప్రాంతంలో పెద్దపులి కదలికలు ఉండడంతో శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం భక్తులు రాకపోవడంతో వెలవెల బోతోంది. బెల్లంపల్లి నియోజకవర్గంలో అతి ప్రాశస్త్యం ఉన్న ప్రాచీన శైవ క్షేత్రంగా బాసిల్లడంతో ప్రతినిత్యం ఇక్కడ భక్తుల తాకిడి ఉంటుంది. ప్రధానంగా కాసిపేట, తాండూర్, బెల్లంపల్లి మండలాల ప్రజలకు శుభకార్యాలకు అనువైన దేవస్థానంగా మారడంతో ఇక్కడ రద్దీ ఉంటుంది. ఈ సీజన్ లో అయ్యప్ప మాలధారణ ఈ దేవస్థానాన్ని అత్యంత పవిత్రంగా భావించి పుణ్య స్నానాలాచరించేందుకు వస్తారు. ప్రతినిత్యం భక్తులతో సందడిగా కనిపించే ఈ శివాలయం పెద్దపులి సంచారంతో గత 14 రోజులుగా భక్తులు రాక కళ తప్పి కనిపిస్తోంది. ఈ దేవస్థానానికి వెళ్లడానికి భక్తులు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



# జాతీయస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైన షహబాజ్

**జనోదయ, మందమర్రి, జనవరి 2:**
పట్టణంలోని పాత బస్టాండ్‌కి చెందిన కృష్ణ వేణి పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని ఎస్కె షహబాజ్ జాతీయస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైందని పాఠశాల కరస్పాండెంట్ రామ్ వేణు, ప్రిన్సిపాల్ గుణవతిలు తెలిపారు. పాఠశాలలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందించి మాట్లాడారు. గత డిసెంబర్‌లో మంచిర్యాల జిల్లా స్థాయి నెట్ బాల్ పోటీలో ఉత్తమ ప్రతిభను కనబరిచి ,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం వహించిందన్నారు నల్గొండ జిల్లాలో నిర్వహించిన నెట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలో క్రీడా



పటిమను కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వివరించారు. ఈ నెల 8న రాజస్థాన్‌లోని బర్మర్‌లో నిర్వహిస్తున్న 69వ జాతీయస్థాయి నెట్ బాల్ పోటీలలో తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్ఐ రాజశేఖర్ జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థిని ఘనంగా సన్మానించారు. జాతీయ స్థాయిలో అత్యధిక ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు తెలంగాణ రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ట్రెజరర్‌గా శ్రీనివాస్



**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 2:**
వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అసోసియేటెడ్ ట్రెజరర్ గా బెల్లంపల్లి పట్టణం చెందిన రేణుకుంట్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అసోసియేటెడ్ అధ్యక్షులు సిద్ధ సూర్యప్రకాశరావు ఈ ఎన్నికను చేపట్టారు. నూతనంగా ఎన్నికైన రేణుకుంట్ల శ్రీనివాస్ ఈ ఏడాది డిసెంబర్ 30 వరకు పదవిలో కొనసాగుతారు.

## క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీసులో ఓటర్ల జాబితా ప్రదర్శన



**జనోదయ, మందమర్రి జనవరి 2 :**
క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ పరిధిలోని 22 వార్డుల ముసాయిదా ఓటర్ల జాబితాను కార్యాలయం నోటీసు బోర్డుపై ప్రదర్శించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ పరిధిలోని 22 వార్డులకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితా (డ్రాఫ్ట్ ఎలక్ట్రోల్స్) ప్రచురించడం జరిగిందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై ఎవరికైన అభ్యంతరాలు ఉంటే, అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా రాసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లో అందజేయాలని కోరారు.

## మానవత్వాన్ని చాటుకున్న జైపూర్ గ్రామ యువకుడు



**జనోదయ, జైపూర్,జనవరి 2**
మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని షారుక్ అనే యువకుడు రహదారి గుండా ప్రయాణిస్తున్నపుడు రహదారిపై పడి ఉన్న పర్స్ చూసి ఎవరో బాటసారి అని గ్రహించి దానిని స్థానిక పోలీస్ స్టేషన్లో అప్ప జెప్పారు. పర్స్‌లో ఉన్న వివరాల ప్రకారం మొబైల్ నెంబర్ ఆధారంగా బాధితునికి సమాచారం అందించి అందులో ఉన్న నగదును 4500 ఉన్నాయని తెలపడం జరిగింది . భీమారం మండల్ నర్సింగాపూర్ గ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించారు. ఆటో డ్రైవర్ జాడి తిరుపతిగా గుర్తించారు. సిఐ నవీన్ కుమార్ ఎస్ఐ శ్రీధర్ సమక్షంలో బాధితునికి పర్సు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.

మన సింగరేణి

శనివారం

03.01.2026



# విడిఏను వెంటనే అమలు చేయాలి

**సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు**

**జనోదయ, మందమర్రి**

సింగరేణి యాజమాన్యం విడిఏ సర్కులర్ జారీ చేసి కార్మికులకు నష్టం లేకుండా వెంటనే అమలు చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విడిఏ సర్కులర్ ను కోల్ ఇండియాలో డిసెంబర్ 8న విడుదల చేసిందని ఆయన గుర్తు చేశారు. సింగరేణి యాజమాన్యం కోల్ ఇండియా సర్క్యులర్‌కు అనుగుణంగా సింగరేణిలో సర్క్యులర్ విడుదల చేసి అమలు చేసేదని, ప్రస్తుతం నెల రోజులు గడిచినప్పటికీ డిఏ సర్క్యులర్ జారీ చేయకపోవడంతో కార్మికులకు నష్టం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విడిఏ పెరుగుదల 2.4% ను (21.2 నుండి 23.6) డిసెంబర్ నెల జీతంలో కలిసి వచ్చే అవకాశం లేదని దీంతో, పెరిగిన విడిఏ వేతనంలో కలవక పోవడంతో కార్మికులు ఆర్థికంగా నష్ట పోవటమే కాక ఈనెలలో పదవీ విరమణ పొందిన కార్మికులకు పెన్షన్, గ్రాడ్యుటీ లెక్కింపులో నష్టం జరుగు తుందన్నారు. వెంటనే సింగరేణి యాజమాన్యం స్పందించి విడిఏ సర్క్యులర్ విడుదల చేసి కార్మికులకు ఆర్థిక నష్టం జరగకుండా చూడాలని ఆయన కోరారు.



# తాగిన మైకంలో భార్యపై భర్త గొడ్డలితో దాడి

**జనోదయ, బెల్లంపల్లి, జనవరి 2:**

తాగిన మైకంలో భార్యపై భర్త గొడ్డలితో దాడి చేసి గాయ పరిచిన ఘటన మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. గురుండ్ల సాయి అనే వ్యక్తి తన భార్య గురుండ్ల వనితపై గొడ్డలితో దాడి చేయగా వనిత తలకు, కుడికాలు, కుడి చేతికి తీవ్రంగా గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే ఎస్సై భాస్కరరావు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ బాధితురాలు గురుండ్ల వనితను 108 అంబులెన్స్ లో బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరపనున్నట్లు ఎస్సై భాస్కరరావు తెలిపారు.

# కేకే ఓసీపీ కార్మికులకు హెచ్ఆర్ఏ సాధించేవరకు ఉద్యమిస్తాం

**హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్**

**జనోదయ, మందమర్రి**

ఏరియాలోని కేకే ఓసిపి ఉద్యోగులకు హెచ్ఆర్ఏ సాధించే వరకు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి వేజ్ బోర్డు సభ్యులు రియాజ్ అహ్మద్ స్పష్టం చేశారు. శుక్రవారం ఏరియాలోని కేకే ఓసీపీలో యూనియన్ జండా ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కార్మికులకు న్యాయంగా రావలసిన హక్కుల కోసం నిరంతరం ఉద్యమిస్తామన్నారు. మహిళా ఉద్యోగుల హక్కుల సంరక్షణకు కృషి



చేయడంతో పాటు వారికి అండగా నిలుస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు యూనియన్‌లో చేరగా వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షులు బెద్దల విజయ్ కుమార్, బెల్లంపల్లి రీజియన్ ఇంచార్జ్ వెల్డి సుదర్శన్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పార్వతి రాజిరెడ్డి, భువన చంద్ర, శ్రీనివాస్ రెడ్డి, శ్రీరాంపూర్ వైస్ ప్రెసి డెంట్ అనిల్ రెడ్డి ,సెక్రటరీ అశోక్, కేకే ఓసీపీ పిట్ సెక్రటరీ మౌనిక , నాయకులు పుల్లూరి మహేష్, దుర్గం రామ్ చెందర్, రతన్ సింగ్, సంతోష్, ప్రదీప్, అశోక్, బెద్దల వెంకటేష్‌లు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం పట్టివేత



**జనోదయ,జైపూర్**

మంచిర్యాల జిల్లా జైపూర్ మండల మండల కేంద్రంలో వాహన తనిఖీలు చేస్తుండగా మహారాష్ట్ర చంద్రపూర్‌కు చెందిన నిఖిల్ రాజు అనే వ్యక్తి తన కారులో చంద్రపూర్ నుండి ఐరి మహారాష్ట్రకు అక్రమంగా దేశిదారు మద్యం బాటిల్లు తరలిస్తుండగా మధ్యాహ్నం 3 గంటలకు సింగరే ణి థర్మల్ పవర్ ప్లాంట్ జైపూర్ వద్ద వెహికల్ చెకింగ్ డ్యూటీలో ఉన్న ఎస్సై జైపూర్ శ్రీధర్ మరియు సిబ్బంది కలిసి అతని కారును పట్టుకున్నారు. కారులో నుండి అక్రమంగా తరలిస్తున్న మొత్తం 2500 దేశి దారు బాటిల్ 90 ఎం.ఎల్ గల (250 లీడర్స్) విలువ సుమారు ఒక లక్ష గలవి మద్యం బాటిల్లు లభించాయి. కారును మద్యం బాటి ల్స్ ని జైపూర్ పోలీస్ స్టేషన్‌కి తరలించి వెహికల్ సీజ్ చేసి నిందితునిపై కేసు నమోదు చేసినట్లుగా పోలీసులు తెలిపారు.

# రోగాలకు నిలయంగా పారిశ్రామిక ప్రాంతం

**రామగుండం** గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతం ఒకప్పుడు 'దక్షిణ భారత బొగ్గు రాజధాని'గా విద్యుత్తు వెలుగులు పంచిన పారిశ్రామిక కేంద్రంగా దేశానికే గర్వకారణంగా ఉండేది. కానీ, నేడు అది 'మరణించే పట్టణం' (డయ్యింగ్ సిటీ) ముద్రను మోస్తూ, కాలుష్యం, నిరుద్యోగం, వలసల చీకట్లో మగ్గుతోందని, మన భవిష్యత్తు, మన పిల్లల ఆరోగ్యం, మన భూమి మనుగడ ప్రమాదంలో పడింది. సింగరేణి 70 వేల ఎకరాలకు పైగా భూమిని సేకరించింది. మైన్ క్లోజర్ అగ్రిమెంట్లు అమలు చేయబడలేదు, మైన్ క్లోజర్ నిబంధనలు పాటించక పోవడం చట్టవిరుద్ధం. ఇది భూమిని, నీటిని శాశ్వతంగా నిరుపయోగంగా మార్చి, జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తుంది. పునరావాసం మరియు పర్యావరణ పునరుద్ధరణ జరగాలని,జనసాంద్రత పతనం 2001లో 4,70,000 ఉన్న జనాభా 2011 నాటికి 2,30,000కి తగ్గింది. ఇది కేవలం వలస కాదు, ఇది ఒక పారిశ్రామిక విధ్వంసం. డీ - ఇండస్ట్రాలైజెషన్ యొక్క క్లాసిక్ లక్షణం డెట్రాయిట్ వంటి నగరాల్లో మాదిరిగా, ఉద్యోగాలు తగ్గడం, కాలుష్యం పెరగడం వల్ల నివాసయోగ్యత తగ్గి, పట్టణం భూత పట్టణం (ఘోస్ట్ టౌన్ ) వైపు పయనిస్తోంది. పర్యావరణ కాలుష్య కేంద్రం ఎన్టిపిసి , సింగరేణి ఓసీపీ గనులు, అర్ఎఫ్సిఎల్, అల్ట్రాటెక్ సిమెంట్ మరియు ఎస్టీపిఎస్ జైపూర్ మొత్తం 5,400 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. 5,400 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉ త్పత్తి కేవలం 2,000 చ.కి.మీ పరిధిలో కేంద్రీకృ తం కావడం ప్రపంచ రికార్డుగా ఉంది,ఇది అత్యంత తీవ్రమైన కాలుష్యానికి దారితీస్తోంది. బొగ్గు ఆధారిత కాలుష్యం ఆరోగ్య అత్యవసర పరిస్థితిని సృష్టిస్తుంది. జల కాలుష్యం పరిశ్రమల వ్యర్థ జలాలు (యాష్, అమ్మోనియా, యూరియా రసాయనాలు) ఎస్టీపి (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) లేకుండా నేరుగా గోదావరినదిలో కలవడం జరుగుతుంది.. ఇది జల కాలుష్య నిబంధనల (వాటర్ పోల్యూషన్ యాక్ట్ 1974) యొక్క దారుణ ఉల్లంఘన. ఎన్టిపిసి యాష్ మిశ్రమంతో కూడిన మురుగునీరు, ఆర్ఎఫ్సీఎల్ రసాయనాలు గోదావరినది జీవరాశిని, నదీ పరీవాహక ప్రాంత ప్రజల ఆరోగ్య భద్రతను ధ్వంసం చేస్తుడటం అత్యంత దారుణం.ఎన్టిపిసి 2,400మెగావాట్స్ జెన్కో 800 మెగావాట్స్ , సింగరేణి ఎస్టీపిఎస్ 800 మెగావాట్స్ అదనపు విస్తరణ కోసం ప్రయ త్నాలు చేస్తుండటం గమనార్హం. 5,400 మెగా వాట్లకే భరించలేని కాలుష్యం ఉండగా, మరో 4,000 మెగావాట్ల విస్తరణ అంటే, మొత్తం 9,400 మెగావాట్లు అవుతుందని, ఇది కేవలం మన గోదారిఖని కాలుష్య నరకం" (పొల్యూషన్ హెల్ ) గా మార్చడమే . పర్యావరణ అనుమతులు, పబ్లిక్ హియరింగ్‌లు కేవలం మొక్కుబడిగా మారుతున్నాయి. భారతదేశంలో గాలి కాలుష్యం వలన ఏటా 19-20 లక్షల మరణాలు సంభవిస్తున్నాయి.PM 2.5, PM 10 వంటి సూక్ష్మ కణాలు ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండె జబ్బులు, ఆస్తమా, శ్వాసకోశ, కిడ్నీ వ్యాధులకు ప్రధాన కారణమని, బొగ్గు బూడిదలో ఉండే ఆర్సెనిక్, లెడ్, పాదరసం వంటి భార లోహాలు (హెవీ మెటల్స్ ) పుట్టబోయే పిల్లల నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయి.పంట పొలాలు, చెట్లు, పశుపక్షాదులు బొగ్గు నుంచి వచ్చే సలార్ డయాక్సైడ్ ఆమ్ల వర్షాలకు (ఆసిడ్ రైన్) కారణమవుతోంది.దీంతో పంట దిగుబడిని తగ్గిస్తోంది, అడవులను నాశనం చేస్తుంది. గోదావరిఖని ప్రాంతం మరణించకూడదని దాని గత వైభవాన్ని తిరిగి తీసుకురావాలంటే, కేవలం ఉద్యోగాల ఆశతో మరిన్ని కాలుష్య ప్రాజెక్టులను ఆహ్వానించడం ఆత్మహత్యాసదృశమే. ఎన్టీపిసి, టీఎస్ జెన్కో, సింగరేణి ఎస్టీపిఎస్ ప్రతిపాదిత అదనపు థర్మల్ విద్యుత్ యూనిట్లను తక్షణమే రద్దు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ప్రాంతంలో మరో మెగావాట్ బొగ్గు ఆధారిత విద్యుత్తును అనుమతించకూడదు. మూసివేసిన గనుల్లో చట్టబద్ధంగా మైన్ క్లోజర్ అగ్రిమెంట్‌ను అమలు చేయాలి.గోదావరిలోకి వ్యర్థ జలాలు వదలడానికి ముందే, పరిశ్రమలు ఖచ్చితంగా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లను మరియు కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలి.



కాలుష్యానికి జరిమానాలు, కాలుష్య ఉల్లంఘనలకు కఠిన చర్యలు, భారీ జరిమానాలు విధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.థర్మల్ విద్యుత్తుపై కాకుండా, సౌర మరియు పవన విద్యుత్ వంటి పునరుత్పాదక శక్తి (రెన్యువబుల్ ఎనర్జీ ) ప్రాజెక్టులను రామగుండంలో నెలకొల్పాలి, ఇది కాలుష్యం లేని ఉద్యోగాలను సృష్టిస్తుంది. సింగరేణిలో తగ్గుతున్న రెగ్యులర్ ఉద్యోగాల స్థానంలో, యువతకు గ్రీన్ టెక్నాలజీలు, ఐటీ, సేవల రంగంలో నైపుణ్య శిక్షణ ఇచ్చి, వలసలను నివారించేలా స్థానిక ఉపాధిని ప్రోత్స హించాలి.కాలుష్య రహిత ప్రాంతం కావాలంటే రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు తక్షణమే ఫ్లూ-గ్యాస్ డీసలార్రైజేషన్ అంటే బొగ్గు వంటి శిలాజ ఇంధనాలను మండించినప్పుడు వెలువడే వ్యర్థ వాయువుల (ఫ్లూ-గ్యాస్) నుండి సల్ఫర్ డ యాక్సైడ్‌ను తొలగించే ప్రక్రియ. ఈ ప్రక్రియలో, సున్నపురాయి లేదా సున్నం వంటి క్షార పదార్థాలను ఉపయోగించి $SO_2$ను తటస్థీకరించి, ఆమ్ల వర్షానికి కారణమయ్యే కాలుష్యాన్ని నివారిస్తారు, తద్వారా పర్యావరణాన్ని మరియు ప్రజారోగ్యాన్ని కాపాడతాయి. కాలుష్య విస్తరణకు ప్రయత్ని స్తున్న ప్రభుత్వాలనను ప్రశజాప్రతినిధులను, నాయకులను నిలదిద్దాం వారి ప్రణాళికలు అభివృద్ధి కాదు, అనారోగ్యం మరియు విధ్వంసం అని గట్టిగా నినది ద్దాం, అభివృద్ధికి వెలుగులు పంచిన గోదావరిఖని ప్రాంతం, కాలుష్యం కారణంగా చీకటిలోకి జారు కోకూడదు. అందరూ ప్రశ్నిస్తేనే మన తరానికి, భావితరాలకు స్వఛమైన గాలి, నీరు, భూమిని అందించగలం. కాలుష్య వ్యతిరేక పోరాటాంలో పాల్గొని మన గొంతుకను బలంగా వినిపిద్దాం, కాలుష్యరహిత రామగుండం కోసం కలిసి పోరాడుదాం.

**మద్దెల దినేష్**
**గోదావరిఖని**



# పాత నేరస్థుల కదలికలపై నిఘా పెట్టండి

**చోరీల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టండి**

**నిందితుల సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవాలి**

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



**జనోదయ, వరంగల్ క్రైమ్, జనవరి 2:**

గతంలో చోరీలకు పాల్పడిన అంతర్ రాష్ట్ర దొంగలపై నిఘా పెట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సిసిఎస్ పోలీసులకు పిలుపునిచ్చారు.వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సిటీ క్రైమ్ స్టేషన్ ను శుక్రవారం తనిఖీ చేశారు. తనిఖీల కోసం సిసి ఎస్ కు చేరుకున్న సిపికి అధికారులు పుష్పగుచ్చాలను అందజేసి స్వాగతం పలకగా, సాయుధ పోలీసులు గౌరవ వందనం చేశారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది కిట్ ఆర్టికల్స్ పరిశీలించిన అనంతరం సీపీ పాత నేరస్తుల ఫోటోలను, రికార్డులను పరిశీలించి,చోరీల నివారణకు తీసుకుంటున్న చర్యలను సీపీ సంబంధిత స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. చోరీల నియంత్రణ కోసం చేపట్టాల్సిన ముందస్తు చర్యలను అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ...చోరీ కేసుల్లో జైలు నుండి విడుదలయిన నిందితుల సమాచారం సేకరించాలని, ఇతర రాష్ట్రాల్లో చోరీ కేసుల్లో పట్టుబడిన నిందితుల వివరాలను అందు బాటులో వుంచుకోవాలని సీ పీ తెలియజేసారు.ఈ తనిఖీ ల్లో క్రైమ్స్ అదనపు డీసీపీ బాలస్వామి, ఏసీపీ సదయ్య, సిసిఎస్ ఇన్స్ స్పెక్టర్లు రాఘవేందర్, రామకృష్ణతో పాటు ఎస్ఐలు పాల్గొన్నారు.

# వరంగల్ అభివృద్ధికి ప్రభుత్వ సహకారం



**సీఎం రేవంత్ రెడ్డి**

**పాలనా సౌలభ్యం కోసం డివిజన్లను పెంచాలి**

**కాజీపేట బస్ స్టేషన్ నిర్మాణానికి భూ కేటాయింపు చేయాలి**

**భద్రకాళి అమ్మవారి దర్శనానికి రావాలి**

**ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు, మేయర్ సుధారాణి**

**జనోదయ, హనుమకొండ, జనవరి 2:**

ప్రజల అవసరాలకు అనుగుణంగా వరంగల్ నగర అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.గ్రేటర్ వరంగల్ డివిజన్ల పెంపు, కాజీపేట బస్ స్టేషన్ భూ కేటాయింపుపై హైదరాబాద్ సెక్రటేరియట్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వరంగల్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి శుక్రవారం వరంగల్ పశ్చిమ నియోజక వర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట శాసన సభ్యులు కే.ఆర్. నాగరాజు, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో పలు కీలక అంశాలపై చర్చించారు.

**డివిజన్లను పెంచాల్సిన అవసరం ఉన్నది...**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ పరిధిలో ప్రస్తుతం ఉన్న 66 డివిజన్లను జనాభా, విస్తీర?ం ఆధారంగా పెంచాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి వివరించారు. వరంగల్ నగరం రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, నగర విస్తరణకు అనుగుణంగా పాలనా సౌలభ్యం కోసం డివిజన్ల సంఖ్య పెంపు అవసరమని స్పష్టం చేశారు. కాజీపేట బస్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన భూ కేటాయింపు ప్రక్రియను రైల్వే శాఖ ద్వారా వేగవంతం చేయాలని కోరారు. ఇప్పటికే కాజీపేట రైల్వే స్టేషన్ ఆవరణలో రైల్వే అధికారులు సర్వే నిర్వహించారని, తదుపరి చర్యలు త్వరితగతిన చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. బస్ స్టేషన్ నిర్మాణం పూర్తయితే కాజీపేటతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగు పడతాయని ఎమ్మెల్యేలు తెలిపారు.

**భద్రకాళి అమ్మవారి దర్శనానికి రండి...**

భద్రకాళి అమ్మవారి ఆలయ అభివ ృద్ధి అంశం,ఆలయ అభివృద్ధి పనులతో పాటు మాడ వీధుల నిర్మాణం జరుగుతున్న విషయాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. భద్రకాళి అమ్మవారి దర్శనానికి వరంగల్‌కు రావాలని ముఖ్యమంత్రిని ఆహ్వానించారు.

## ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సమీపంలో వైన్‌షాప్

**వేరే చోటుకు తరలించాలి**

**బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు**



**జనోదయ జమ్మికుంట జనవరి 02:**

ప్రభుత్వ డిగ్రీ , జూనియర్ కళాశాలకి కేవలం 90 మీటర్ల దూరంలో, కాకతీయ స్కూల్ గేటుకి 50 మీటర్ల దూరంలో వైన్‌షాపు ఏర్పాటుచేయడం వలన విద్యార్థులకు వేదింపులు తప్పడం లేదని బీజేపీ పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు అన్నారు. రాష్ట్ర రహదారికి అనుకొని, కళాశాలలకు దగ్గర ఉన్న కృష్ణ వైన్ షాప్‌ను వేరే చోటుకు తరలించాలని జమ్మికుంట ఎక్సైజ్ సిఐకి పట్టణ కమిటీ తరుపున వినతి పత్రం ఇవ్వడం జరిగిందని, అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చ ప్రధానకార్యదర్శి ఆకుల రాజేందర్, దొంతుల రాజ్ కుమార్, రాజేష్ ఠాకుర్, కైలాసకోటి గణేష్, దాసరి రవిందర్, యాంసాని సమ్మయ్య, అప్పాల రవిందర్, కొండపర్తి ప్రవీణ్, మురికి మహేష్, ఇటుకాల స్వరూప, నిరుపమా రాణి, బచ్చు శివన్న, కొండ్లె నగేష్, దొడ్డే వేణుగోపాల్, మెరుపురి రాజు, ఉడుగుల మహేందర్, పొనగంటి రవి, తూడి రవిచందర్, ఆవాంచ వెంకటేష్, ఆకుల పోచయ్య, తిరుపతి, సిరియాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## సీట్ బెల్ట్ విధిగా ధరించండి

**హుజురాబాద్ ఎంవీఐ కంచి వేణు**



**జనోదయ, హుజురాబాద్ జనవరి 02:**

జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా హుజురాబాద్ పరకాల రోడ్డు క్రాస్ వద్ద సీట్ బెల్ట్‌పై హుజురాబాద్ వాహనాల తనిఖీ అధికారి కంచి వేణు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణంలో సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి, ఇది ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడుతుంది, తీవ్రమైన గాయాల నుండి రక్షిస్తుంది, చట్టపరంగా కూడా ఇది తప్పనిసరి, డ్రైవర్లు మరియు ప్రయాణీకులు (ముందు, వెనుక సీట్లలో ఉన్న వారు) అందరూ ప్రతి ప్రయాణంలో, ఎంత చిన్నదైనా సరే తప్పకుండా ధరించాలన్నారు. ప్రమాదం జరిగినప్పుడు వాహనం నుండి బయటకు విసిరివేయబడకుండా నిరోధిస్తుందన్నారు ఇది మరణాలకు ప్రధాన కారణంకారు లోపలి భాగాలను ఢీకొనకుండా, లేదా పక్కకు విసిరివేయబడకుండా కాపాడుతుంది, తీవ్రమైన గాయాల ప్రమాదాన్ని సగానికి పైగా తగ్గిస్తుందన్నారు.ఇది భారతదేశంలో మోటారు వాహన చట్టాల ప్రకారం తప్పనిసరి, ఉల్లంఘించినవారికి జరిమానా విధిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది కానిస్టేబుల్ నాగరాజు,హోంగార్డ్ బుర్ర సురేష్ పాల్గొన్నారు.







# వార్షిక రుణ లక్ష్యాల సాధనకు కృషిచేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**జానోదయ ఉమ్మడి జిల్లా ప్రతినిధి**

జిల్లా వార్షిక రుణ లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేలా బ్యాంకర్లు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎ.జి.ఎం. చేతన్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ప్రశాంత్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ సురేష్ లతో కలిసి వివిధ బ్యాంకుల అధికారులతో రుణ లక్ష్యసాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్-2025 వరకు పంట రుణాలకు 2 వేల 541 కోట్ల రూపాయలు లక్ష్యం కాగా 1 వేయి 45 కోట్ల రూపాయలు, వ్యవసాయ దీర్ఘకాలిక రుణాలకు గాను 922 కోట్ల రూపాయలకు గాను 323 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, వ్యవసాయ రంగానికి 4 వేల 322 కోట్ల రూపాయలు లక్ష్యం కాగా 1 వేయి 572 కోట్ల రూపాయలు మం జూరు చేయడం జరిగిందని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ లకు 1 వేయి 105 కోట్ల రూపాయలు లక్ష్యం కాగా 437 కోట్ల రూపాయలు, విద్యా రుణాలు 138 కోట్ల రూపాయలు లక్ష్యం4.6 కోట్ల రూపాయలు,గృ హనిర్మాణ రుణాల లక్ష్యం 269 కోట్ల రూపాయలకు గాను 34 కోట్ల రూపాయలు, ప్రాధాన్యత రంగాల క్రింద 5 వేల 936 కోట్ల రూపాయలకు గాను 2 వేల 81 కోట్ల రూపాయలు, ప్రాధాన్యేతర రంగాల క్రింద 1 వేయి 940 కోట్ల రూపాయలకు గాను 1 వేయి 256 కోట్ల రూపాయలు సాధించడం జరిగిందని తెలిపారు. ముద్ర రుణాల క్రింద 11 వేల 272 మందికి 125 కోట్ల రూపాయలు అందించడం జరిగిందని, 9 వేల 315 స్వయం సహాయక సంఘాలకు గాను 679 కోట్ల రూపాయలు లక్ష్యం కాగా 380 కోట్ల రూపాయలు సాధించడం జరిగిందని తెలిపారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం క్రింద 212 మంది లబ్దిదారులకు 2.07 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ప్రధానమంత్రి జన్ ధన్ పథకం క్రింద 3 లక్షల 15 వేల 486 మందికి ఖాతాలు తెరువడం జరిగిందని, ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన పథకం క్రింద 1 లక్షా 24 వేల 389 మందికి, ప్రధానమంత్రి సురక్షా భీమా యోజనలో 3 లక్షల 28 వేల 275 మందికి, అటల్ పెన్షన్ యోజన పథకం క్రింద 39 వేల 20 మంది నమోదు చేసుకున్నారని తెలిపారు. మంచిర్యాల జిల్లాకు చెందిన 105 మందికి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థల ద్వారా శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డు క్రింద చేపల పెంపకం కొరకు 9 మంది లబ్దిదారులకు, పాడి పశువులకు గాను 96 మంది లబ్దిదారులకు లబ్ది చేకూర్చడం జరిగిందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ఆధారంగా అభివృద్ధి చెందే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రాధాన్యత రంగాలలో రుణాల కొరకు వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు తెలిసే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. చిరు వ్యాపారాలు, విద్య, గృహ రుణాలను వినియోగించుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపన, అభివృద్ధిపై ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ప్రజలకు వివరించాలని తెలిపారు. షెడ్యూల్డ్ తెగల మహిళలకు పట్టు పరిశ్రమ నిర్వహణపై శిక్షణ అందించి ఉపాధి పొందే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. వ్యవసాయ సాగుకు సంబంధించి రుణాలు పొందిన రైతులు సకాలంలో తిరిగి చెల్లించి అవసరమైన నూతన రుణాలు పొందేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రుణ ప్రణాళిక లక్ష్యాలను సాధించే విధంగా బ్యాంక్ అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, బ్యాంకుల మేనేజర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## జగిత్యాలలో
# 12,000 రూపాయల కోసం హత్య


**హత్యకు పాల్పడ్డ ఇద్దరు నిందితుల అరెస్ట్**

**వివరాలు వెల్లడించిన పట్టణ సిఐ కరుణాకర్**



**జనోదయ, జగిత్యాల ప్రతినిధి, జనవరి 02**

జగిత్యాల పట్టణంలోని గోవిందుపల్లికి చెందిన కొలగాని అంజయ్యను జగిత్యాల పట్టణానికి చెందిన బాసోజి శ్రీనివాస్ ఇతని కొడుకు వేణు, చారి లు కలిసి డిసెంబర్ 31న దాడి చేసి హత్య చేసినట్టు పట్టణ సిఐ కరుణాకర్ తెలిపారు. మృతుడు అంజయ్యకు నిందితుడు శ్రీనివాస్ చిట్టి డబ్బులు రూ 12000 ఇచ్చేది ఉండగా అట్టి డబ్బులు ఇవ్వమన్నందుకు నిందితులు ఇద్దరు పథకం ప్రకారం పిలిపించుకుని దాడికి పాల్పడ్డారు.




# త్వరలో 'ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్ట్'

**మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్, జనవరి 2 :** డ్రైవింగ్ లైసెన్సుల జారీలో పారదర్శకతను పెంపొందించేందుకు త్వరలో ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్టింగ్ విధానాన్ని ప్రవేశ పెట్టనున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గూడ్స్ వాహనాలకు త్రైమాసిక ట్యాక్స్ ఉందని, దాన్ని 7.5శాతం లైఫ్ ట్యాక్స్‌గా మార్చినట్టు తెలి పారు.ఇది కొత్తగా రిజి స్ట్రేషన్ అయ్యే వాహనాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలకు మాత్రమే వర్తి స్తుందని చెప్పారు. ఆటోలు, ట్రాక్టర్లు, ట్రైలర్లకు సెస్ వర్తించదని మంత్రి స్పష్టంచేశారు.

# కీలక బిల్లులకు అసెంబ్లీ ఆమోదం



**హైదరాబాద్, జనవరి 2 :**

తెలంగాణ శాసనసభ శుక్రవారం పలు కీలక బిల్లులకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. తెలంగాణ మున్సి పాలిటీల (నాలుగో) సవరణ బిల్లు, జీహెచ్ఎంసీకి చెందిన రెండు సవరణ బిల్లులు, తెలంగాణ ప్రైవేట్ యూనివర్సిటీల ఎస్టా బ్లిష్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ సవరణ బిల్లు, తెలంగాణ మో టర్ వెహికిల్ ట్యాక్సేషన్ సవరణ బిల్లులు ఉన్నాయి.ఇందులో భాగంగా తెలంగాణ ప్రైవేట్ యూనివర్సిటీల ఎస్టాబ్లిష్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ సవరణ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం మామిడిపల్లిలో రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్టు వద్ద ఢిల్లీకి చెందిన అమిటీ యూనివర్సిటీ, భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం దేశ్‌ముఖిలో సెయింట్‌మేరీస్ రిహాబిలిటేషన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నారు.

# కేసీఆర్..సభకు రావాలి



**హైదరాబాద్, జనవరి 2 :** కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా, సభలో మాట్లాడకుండా ఉంటే ఇక బీఆర్ఎస్‌ను దేవుడు కూడా కాపాడలేడని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. పాల మూరు-రంగారెడ్డి ఇన్‌టేక్ పాయింట్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి ఎందుకు మార్చారో ఆయనే స్వయంగా అసెంబ్లీకి వచ్చి సమాధానం చెప్పాలని కోరారు. శుక్రవారం శాసనమండలి ఆవరణలో ఆమె మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. బబుల్ షూటర్ల(బుడగలు పేల్చేవారి) వల్లే పార్టీకి ట్రబుల్స్ వచ్చాయని వ్యాఖ్యానించారు. హరీశ్ కారణంగానే మొదటి ప్యాకేజీ దెబ్బతిందని, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఇబ్బందుల్లో పడిందని ఆరోపించారు. "రేవంత్‌తో కేసీఆర్ మాటలు పడాల్సిన అవసరం ఏముంది? తెలంగాణ ప్రజల కోసం అసెంబ్లీకి వచ్చి మాట్లాడి, తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలి" అని డిమాండ్ చేశారు. బబుల్ షూటర్లకు పెత్తనమిచ్చి సభలో మాట్లాడిస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని చెప్పారు. పాలమూరులో ప్యాకేజీని అమ్ముకున్న హరీశ్‌రావు కాకుండా పూర్తి అవగాహన ఉన్న కేసీఆర్ వచ్చి మాట్లాడితే బాగుంటుందని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి విషయంలో అక్రమాలకు పాల్పడిన వారిని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌ను చేయడం కన్నా అన్యాయం మరొకటి లేదని వ్యాఖ్యానించారు. హరీశ్ సభలో మాట్లాడితే కాంగ్రెసతో మ్యాచ్ ఫిక్సింగ్ అవుతుందన్నారు. గతంలో రేవంత్‌రెడ్డి ఛాంబర్‌కు వెళ్లి హరీశ్‌రావు ప్రత్యేకంగా మాట్లాడుకున్నది అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. అలాంటి వ్యక్తికి నీళ్ల గురించి మాట్లాడే అవకాశమిస్తే బీఆర్ఎస్‌కు నష్టమేనని చెప్పారు.బీఆర్ఎస్‌లో కేటీఆర్, హరీశ్‌లిద్దరూ పిల్లకాకులేనని, కేసీఆర్ డైరెక్షన్‌లో పని చేస్తున్నారన్నారని, తాను మాత్రం మొదటి నుంచి స్వతంత్రంగా పని చేశానని కవిత అన్నారు. బీఆర్ఎసపై పూర్తిగా మనసు విరిగిందని, కేసీఆర్ పిలిచినా మళ్లీ వెళ్లే ప్రసక్తే లేదని చెప్పారు. తెలంగాణకు స్వీయ రాజకీయ శక్తి అవసరమని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సొంత పార్టీ ద్వారా ఎన్నికల్లో పోటీ చేస్తానని అన్నారు. తాను సెప్టెంబరు 3న రాజీనామా చేశానని, నాలుగు నెలలుగా ఆమోదించలేదని, ఈ నేప థ్యంలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కలిశానని తెలిపారు. ఈ నెల 5న మండలిలో మాట్లాడతానని, ఎమ్మెల్సీ పదవికి ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చిందో ప్రజలకు వివరిస్తానని ప్రకటించారు. కేసీఆర్‌ను కసబ్‌తో పోల్చడంపై కూతురుగా తన రక్త మరుగుతోందని కవిత అన్నారు. సీఎం తన మాట తీరు మార్చు కోవాలని హెచ్చరించారు. పాలమూరుకు తీరని అన్యాయం చేస్తున్న రేవంత్‌రెడ్డిని ఎన్నిసార్లు ఉరితీయాలని ప్రశ్నించారు.రాయలసీమ లిఫ్ట్ పథకాలపై కోర్టు స్టేలు ఉన్నప్పటికీ చంద్రబాబు, జగన్ రాజకీయాలకు అతీతంగా నిర్మాణ పనులు కొనసాగించారని చెప్పారు.

Publisher, Editor and Owned by Manasani Krishna Reddy, H No 4-81/1, Ramagundam, Elkalpalli, Karimnagar, Telangana - 505208. RNI No - APTEL/2022/81596 .. Cell No - 8074124190 .... Printed At SUNDAY PRINTING PRESS,Rangareddy, Hyderabad - 500072 ..Cell No - 7386045673

# నూతన సర్పంచులతో అధికారుల పరిచయ వేదిక

**జనోదయ గంగాధర జనవరి 02:**

నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ప్రజాప్రతినిధులతో మండల స్థాయి అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన ఈ పరిచయ వేదికలో ఎంపిడిఓ రాము, ఎంఆర్ఓ అంబటి రజిత ,మార్కెట్ చైర్మెన్ రజిత, గంగాధర ఎస్ఐ వంశీ కృష్ణ, ఎం.పీ.ఓ ప్రతుషా ,ఇతర మండల అధికారులు పాల్గొని గ్రామాభివృద్ధి, శాంతిభద్రతలు, పాలనలో సమన్వయంపై దిశానిర్దేశం చేశారు. నూతనంగా ఎన్నికైన గ్రామా సర్పంచ్ లు పరిచయాలు చేస్కున్నారు.



ఈ సందర్భంగా ఎస్ఐ వంశీకృష్ణ మాట్లాడుతూ... గ్రామాభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధుల పాత్ర ఎంత ముఖ్యమో, శాంతిభద్రతల పరిరక్షణ కూడా అంతే కీలకమని అన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో గంజాయి, డ్రగ్స్ వినియోగం, సైబర్ నేరాలు, పోక్సో కేసులు, బాల్య వివాహాలు ప్రధాన సమస్యలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని, సైబర్ నేరాల విషయంలో లింకులు, ఓటీపీలు, అనుమానాస్పద కాల్స్‌పై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, పోక్సో చట్టం అత్యంత కఠినమని గ్రామస్థులకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు సీసీ కెమెరాలు, వీధి దీపాల ఏర్పాటులో గ్రామ పంచాయతీలు చొరవ చూపాలని కోరారు.



ఎంపిడిఓ మాట్లాడుతూ.. సర్పంచ్‌గా ఎన్నిక కావడం గొప్ప బాధ్యత అని, గ్రామ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి అంటే కేవలం సీసీ రోడ్లు, భవనాలు మాత్రమే కాదని, మానవాభివృద్ధి, పరిశుభ్రత, సామాజిక బాధ్యత కూడా భాగమని చెప్పారు. ప్రతి తీర్మానం రాజ్యాంగబద్ధంగా, పంచాయతీ రాజ్ చట్టం పరిధిలోనే ఉండాలని సూచించారు. ప్రభుత్వ శిక్షణా కార్యక్రమాలు, మహిళా సాధికారత, విద్య, పారిశుద్ధ్యం, సంక్షేమ పథకాల అమలులో సర్పంచులు ముందుండాలని పిలుపునిచ్చారు.





మండల పంచాయతీ అధికారి ప్రత్యూష మాట్లాడుతూ.. ఈ వ్యవస్థకు కొత్తగా వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు చాలామందే ఉన్నారని, సమర్థవంతంగా పనిచేయాలంటే కోఆర్డినేషన్ చాలా ముఖ్యమని అన్నారు. సుమారు 130 మంది అభ్యర్థుల మధ్య నుంచి 33 మంది సర్పంచులను ప్రజలు ఎన్నుకోవడం వారి మీద పెట్టుకున్న నమ్మకానికి నిదర్శనమని చెప్పారు. పంచాయతీ కార్యదర్శుల అనుభవాన్ని సద్వినియోగం చేసుకుంటే పనులు సులభంగా సాగుతాయని సూచించారు.



ఎంఆర్ఓ రజిత మాట్లాడుతూ.. తహసీల్దార్ కార్యాలయంలో ఎక్కువగా జరిగే పనులు సర్టిఫికెట్లకు సంబంధించినవేనని తెలిపారు. కుల సర్టిఫికెట్‌కు సుమారు నెల రోజుల సమయం, ఆదాయం-నివాస సర్టిఫికెట్లకు వారం రోజులు, జనన-మరణ సర్టిఫికెట్లకు 45 రోజుల గడువు ఉంటుందని వివరించారు. ఈ విషయాలపై ప్రజలకు ముందుగానే అవగాహన కల్పించాలని కోరారు. భూ సమస్యల విషయంలో యాసా, భూ భారతి, పట్టా మార్పిడి వంటి అంశాలపై సరైన విధంగా దరఖాస్తు చేయాలని, సందేహాలుంటే నేరుగా ఎంఆర్ఓ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, నక్ష దారులు, గ్రామ సమస్యలు వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.



సమావేశం అనంతరం నూతనంగా ఎన్నికైన సర్పంచులను అధికారులు శాలువాలతో సన్మానించారు. గ్రామాభివృద్ధికి అధికారులు-ప్రజాప్రతినిధుల సమన్వయంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.




# జగిత్యాలలో 12,000 రూపాయల కోసం హత్య

**జనోదయ, జగిత్యాల ప్రతినిధి, జనవరి 02:**

జగిత్యాల పట్టణంలోని గోవిందుపల్లికి చెందిన కొలగాని అంజయ్యను జగిత్యాల పట్టణానికి చెందిన బాసోజి శ్రీనివాస్ ఇతని కొడుకు వేణు, చారి లు కలిసి డిసెంబర్ 31 న దాడి చేసి హత్య చేసినట్టు పట్టణ సిఐ కరుణాకర్ తెలిపారు. మృతుడు అంజయ్యకు నిందితుడు శ్రీనివాస్ చిట్టి డబ్బులు రూ 12000 ఇచ్చేది ఉండగా అట్టి డబ్బులు ఇవ్వమన్నందుకు నిందితులు ఇద్దరు పథకం ప్రకారం పిలిపించుకుని దాడికి పాల్పడ్డారు.



# కరీంనగర్ గ్రామీణ మండలంలో పులి సంచారం

**జనోదయ కరీంనగర్ జనవరి 02:**

కరీంనగర్ గ్రామీణ మండలంలోని జూబ్లీనగర్ గుట్ట వద్ద గురువారం నుంచి పులి సంచరిస్తున్నట్లు గ్రామస్థులతోపాటు అటవీశాఖ అధికారులు నిర్ధరించారు. ప్రస్తుతం అటవీ శాఖ సిబ్బంది పులిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే పులి అడుగులను గుర్తించారు. జూబ్లీనగర్ గుట్ట సమీపంలో పొలం వద్ద కట్టేసిన ఓ గేదెపై పులి దాడి చేసి చంపినట్లు వెటర్నరీ డాక్టర్ రామకృష్ణ తెలిపారు.

# మీ ఊరు.. మీ హక్కు

**జనోదయ కమాంపూర్ పెద్దపల్లి జనవరి 02:**

గ్రామపంచాయతీలో నిర్వహించే 'గ్రామ సభ' సర్పంచి నుంచి సామాన్యుడి వరకు ఒకే వేదికపై కూర్చొని సమస్యలపై గొంతెత్తే ప్రజాస్వామ్య వేదిక. గ్రామాభివృద్ధికి నిర్ణయాలు, తీర్మానాలు చేసేచోటు. ఇందులో చేసే ప్రతి సంతకం, తీర్మానం ఊరి భవిష్యత్తును నిర్ణయించే శాసనం. గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు, ఏదైనా పని జరగాలంటే గ్రామసభ ఆమోదం తప్పనిసరి. గ్రామ పంచాయతీలో నిర్వహించే గ్రామసభకు గైర్హాజరవటం అంటే ఊరి అభివృద్ధిని ఇతరుల చేతుల్లో పెట్టడమేనని గుర్తుంచుకోవాలి.

గ్రామసభలో గ్రామంలోని ఓటర్లందరూ సభ్యులుగా ఉంటారు. పంచాయతీ కార్యదర్శి సభకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, ఎమ్మెల్యే, మంత్రులు, కలెక్టర్ శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు. సర్పంచి అధ్యక్షతన గ్రామసభలో గ్రామ అభివృద్ధిపై చర్చిస్తారు.

- తీర్మానాల్లో అవకతవకలు జరిగాయని ఎవరైనా భావిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయొచ్చు.
- తీర్మానాలను సమీక్షించే అధికారం కలెక్టర్‌కు ఉంటుంది. ఆమోదయోగ్యంగా లేనివాటిని కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో రద్దు చేస్తారు.
- పంచాయతీరాజ్ చట్టంప్రకారం ఏడాదికి ఆరుసార్లు గ్రామసభ నిర్వహించాలి.
- సర్పంచి అధ్యక్షతన గ్రామసభ కొనసాగుతుంది. సర్పంచి లేనిపక్షంలో ఉపసర్పంచి నిర్వహిస్తారు.
- గ్రామ సభలో చర్చించిన అంశాలు, నిర్ణయాలను తీర్మానాల రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. మెజారిటీ సభ్యులు ఒక పనికి అంగీకరిస్తే దాన్ని తీర్మానంగా మారుస్తారు. తీర్మాన ప్రతిని మూడు రోజుల్లోగా ఉన్నతాధికారులకు పంపిస్తేనే నిధులు మంజూరవుతాయి.

సాధారణంగా మొత్తం ఓటర్లలో పదోవంతు లేదా గ్రామ జనాభాను బట్టి నిర్ణయించిన సంఖ్యలో సభ్యులు హాజరుకావాలి. నిర్ణీత గడువులోగా కోరం లేకపోతే సభను రెండు గంటల పాటు వాయిదా వేస్తారు. అప్పటికీ లేకపోతే ఉన్నవారితోనే గ్రామసభను కొనసాగిస్తారు. గ్రామ ఓటర్లు గ్రామసభకు హాజరుకాకపోవడంతో సర్పంచి, ఉపసర్పంచి అనుకూలమైన వారితో తీర్మానాలు చేయించుకునే ఆస్కారముంది.



# తీగలగుట్టపల్లిలో ప్రభుత్వ భూముల కబ్జాలపై విచారణ జరపాలి


## కరీంనగర్ కార్పొరేషన్ డివిజన్ –2 కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలగాని అనిల్

- **కబ్జాలపై కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు**

**జనోదయ కరీంనగర్ జనవరి 02:**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తీగలగుట్టపల్లి (డివిజన్ నెం.2) ప్రాంతంలో ప్రభుత్వ భూములు అక్రమంగా కబ్జాకు గురవుతున్నాయని కరీంనగర్ కార్పొరేషన్ డివిజన్ -2 కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలగాని అనిల్ గారు ఆరోపించారు. ఈ మేరకు ఆయన కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నెం.120లో గతంలో ప్రభుత్వం రెవెన్యూ ఉద్యోగుల కోసం లే-అవుట్ రూపొందించి ఇండ్ల స్థలాలు కేటాయించిందని, ఇందులో పాఠశాల, టౌన్ హాల్, గుడి, మసీదు, చర్చి, పార్క్‌లకు ప్రత్యేకంగా భూములు కేటాయించినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం పాఠశాల, పార్క్‌కు కేటాయించిన భూములు అక్రమంగా ఆక్రమణకు గురై అపార్ట్‌మెంట్‌లు, నివాస గృహాలు నిర్మించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంకా అదే సర్వే నెంబర్ లో మిగిలి ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుని,ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు. ఇందుకు సంబంధించి లే-అవుట్ ప్లాన్, ఫోటో ఆధారాలను కమిషనర్‌కు సమర్పించినట్లు తెలిపారు.





ఆర్యా!

విషయం: కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధి – తీగలగుట్టపల్లి (డివిజన్ నెం.2) లోని సర్వే నెం.120 లో తాజా, మాజీ నాయకుల సహకారముతో ఇండ్ల నిర్మాణ అక్రమ అనుమతులు - కబ్జా గురైన విషయము గురించి.

<><><>

నా మనవి ఏమనగా, కొలగాని అనిల్, తండ్రి.లక్ష్మయ్య, తీగలగుట్టపల్లి, కరీంనగర్ నివాసుడను.

కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని తీగలగుట్టపల్లి ప్రాంతములోని సర్వే నెం.120 లో గత 25 సం.ల క్రితం అప్పటి ప్రభుత్వం 120 సర్వే నెంబర్లోని ప్రభుత్వ భూమిని రెవెన్యు ఉద్యోగుల కోసం ఇండ్ల స్థలాలను లే-అవుట్ చేసి కేటాయించడం జరిగింది. ఇందులో పాటశాల కొరకు, టౌన్ హాల్ కొరకు, గుడి, మసీదు, చర్చి మరియు పార్క్ కొరకు స్థలమును కేటాయించడం జరిగింది. ప్రస్తుతం పార్క్, పాటశాల స్థలము కబ్జాకు గురైనది. ఇట్టి స్థలములో అపార్టుమెంటు మరియు ఒకటి, రెండు గృహాలు కూడా నిర్మించడం జరిగింది. ఇదే కాకుండా 120 సర్వే నెంబర్లో ఇంకా ప్రభుత్వ భూమి మిగిలి యున్నది. అట్టి భూమిని ఎక్కడ ఎక్కడ ఆక్రమణకు గురైనదో దానిని గుర్తించి ప్రజల మరియు ప్రభుత్వ సౌకర్యార్థం కాపాడగలరు. కావున ఇట్టిదానిపైన సమగ్రంగా విచారణ జరిపి తగు చర్య గైకొని అట్టి స్థలమును డివిజన్ ప్రజల ఉపయోగములోకి తీసుకోగరలని కోరుచున్నాను.

జతలు:

1) ప్రభుత్వం ఇచ్చిన లే అవుట్ ప్లాన్
2) ఫోటో కాపీలు

ఇట్లు
మీ విధేయుడు
(కొలగాని అనిల్)
తండ్రి.లక్ష్మయ్య,

# నేడు పవన్ కల్యాణ్ కొండగట్టు పర్యటన

## ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**జనోదయ కొండగట్టు, జనవరి 02:**

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేడు కొండగట్టుకు రానున్నారు. ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు టీటీడీ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. కొండ గట్టు ఆలయ అభివృద్ధికి సహకారమందిస్తానని గతంలో పవన్ కళ్యాణ్ మాటిచ్చారు. ఈ మేరకు టీటీడీ అధికారులతో చర్చించి రూ 35.19 కోట్లు మంజూరు చేయించారు. పవన్ పర్యటన నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పవన్ కళ్యాణ్ ఉదయం 9.25 గంటలకు హైదరాబాద్ బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.25 గంటలకు కొండగట్టు జేఎన్టీయూ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం 10.30 గంటలకు ఆంజనేయ స్వామివారిని దర్శించుకుంటారు. అనంతరం టీటీడీ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇందులో భక్తుల వసతికై 96 గదుల నిర్మాణం, ఒకేసారి రెండు వేల మంది దీక్ష విరమణ చేసుకునేలా మాల విరమణ మండప నిర్మాణ పనులు ఉన్నాయి. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఏపీ శాసన మండలి విప్ పిడుగు హరిప్రసాద్, టీటీడీ బోర్డు మెంబర్లు బి.ఆనందసాయి, బి. మహేందర్ రెడ్డి, టీటీడీ ఎల్ఏసీ చైర్మన్ ఎన్ శంకర్ గౌడ్ తదితరులు పాల్గొననున్నారు. ఆంజనేయ స్వామి దర్శనం అనంతరం పవన్ కళ్యాణ్ 11.30 గంటలకు కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామంలోని ఓ రిసార్ట్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ జనసేన పార్టీ నాయకులతో పవన్ చర్చించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్‌కు వెళ్లనున్నారు. ఈ పర్యటనకు భారీ భద్రత ఏర్పాటు చేయగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. పవన్ కళ్యాణ్ పర్యటన నేపథ్యంలో జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ లు శుక్రవారం హెలిప్యాడ్ సహా టెంపుల్ పరిసరాలను పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

